క్లుప్తంగా

కంపచెట్ల తొలగింపు



జేసీబీతో కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

రామగిరి: మండలంలోని కుంటిమద్ది, శ్రీహరిపురం నుంచి చెన్నేకొత్తపల్లి మండలం దామాజిపల్లికి సోమవారం కంపచెట్ల తొలగింపు పనులను సర్పంచ్ నరేంద్ర చేపట్టారు. రెండు కిలోమీటర్ల మేర రోడ్డుకిరువైపులా కంపచెట్లను జేసీబీతో తొలగించారు.

సిమెంటు బస్తాల పంపిణీ

గాండ్లపెంట: 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా సోమవారం సిమెంటు పంపిణీ చేసినట్లు హౌసింగ్ ఏఈ చంద్రారెడ్డి తెలిపారు. గాండ్లపెంట, తూపల్లి గ్రామాలకు చెందిన సుమారు 21 మందికి 630 సిమెంట్ బస్తాలను పంపిణీ చేసినట్లు వివరించారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని లబ్ధిదారులకు చెప్పారు.

ఘనంగా కనకదాస జయంతి



పూజల్లో పాల్గొన్న కురుబలు

రామగిరి: మండలంలోని కుంటిమద్దిలో కనకదాస జయంతిని పురస్కరించుకొని గ్రామస్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కురుబల ఆరాధ్యుడు కనకదాస చిత్రపటానికి గ్రామస్తులు పూలమాల వేసి, భజనలు, కీర్తనలను పాడారు. ఏటా కనకదాస జయంతి సందర్భంగా గ్రామంలో కలసికట్టుగా వేడుకను జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోసే నాగార్జున, శంకరయ్య, ముత్యాలప్ప, చిన్నప్ప, తిరుపాల్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు 2 ఫిర్యాదులు

గాండ్లపెంట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ హమీద్‌బాషా తెలిపారు. మలమీదపల్లికి చెందిన అమీర్, కొండయ్య అనే రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలని తహసీల్దార్‌కు కోరారు.

రస్తా సమస్య పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు

తనకల్లు: మండల పరిధిలోని గేమేనాయక్ తండా, పోమేనాయక్‌తండాల్లో నెలకొన్న రస్తా సమస్యను పరిష్కరించాలని కోరుతూ గిరిజనులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వారు మాట్లాడతూ నాగరాజు అనే వ్యక్తి రోడ్డుకిరువైపుల ఉన్న భూములను కొని తమకు రోడ్డు లేకుండా చేస్తున్నాడని తెలిపారు. 14 మంది గిరిజనులపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. న్యాయం జరిగేంత వరకు వెళ్లమంటూ కార్యాలయం తలుపులు మూసి భీష్మించుకు కూర్చున్నారు. తహసీల్దార్ శోభ సువర్ణమ్మ వారితో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని చెప్పడంతో శాంతించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ప్రసాద్‌నాయక్, రవీంద్రానాయక్, శేఖర్‌నాయక్, రాజేష్‌నాయక్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

మోడల్ పరీక్ష పేపర్ల ఆవిష్కరణ



మోడల్ ప్రశ్నపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఈఓ మీనాక్షి, యూటీఎఫ్ నాయకులు

పుట్టపర్తి: 10వ తరగతి నమూనా ప్రశ్నపత్రాలను జిల్లా విద్యాధికారిణి మీనాక్షి ఆవిష్కరించారు. సోమవారం కొత్తచెరువు డీఈఓ కార్యాలయం ఆవరణలో జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్ ఆధ్వర్యంలో పేపర్లను ఆవిష్కరించారు. విద్యార్థులకు బాగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఏడీ నాగరాజు, ఓపెన్ స్కూల్స్ కో ఆర్డినేటర్ లాజర్‌బాష, యూటీఎఫ్ నేతలు శివ, లక్ష్మినారాయణ, శివశంకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పీఠంపై మళ్లీ జగన్‌ను కూర్చోబెడదాం

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: ముఖ్యమంత్రి పీఠంపై వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరో సారి కూర్చోబెట్టడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పుట్టపర్తి మండలం దిగువచెర్లోపల్లి, గంగిరెడ్డిపల్లి, సాతార్లపల్లి గ్రామాల్లో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, సర్పంచ్ కామాక్షమ్మ ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంగా ఎమ్మెల్యే వెంట నడిచారు. మూడు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో ప్రతి ఇంటికీ అందించిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ లబ్ధి చేకూరడంతో ప్రజలు సంతోషాన్ని ఎమ్మెల్యేతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దిగువచెర్లోపల్లి, సాతార్లపల్లి, గంగిరెడ్డిపల్లి అటవీ గ్రామాల సమీపంలో త్వరలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రానుండడంతో భూముల విలువ కోట్లలో ఉంటుందన్నారు. ఎవరూ భూములను అమ్ముకోరాదన్నారు. పెడపల్లి– కొండకమర్ల దాకా డబుల్ రోడ్డు వస్తే రవాణాకు ఎటువంటి ఆటంకాలు ఉండవన్నారు. రెండేళ్ల క్రితం గండి పడిన గంగిరెడ్డిపల్లి చెరువుకు రూ.8 లక్షలు వెచ్చించి పటిష్టంగా కట్ట మరమ్మతు చేసినట్లు చెప్పారు. అభయాంజనేయస్వామి ఆలయాన్ని టీడీపీ నాయకులు నిర్వీర్యం చేశారని ఆరోపించారు. తాము ఆలయాన్ని సుమారు రూ.కోటిన్నరతో పూర్తి చేయడంతో వేలాది మంది భక్తులు దర్శించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు హనుమంతరెడ్డి, రంగన్న, మండల కన్వీనర్ నరసారెడ్డి, సచివాలయ కన్వీనర్ మల్లిఖార్జున, పార్టీ పరిశీలకులు మాధవరెడ్డి, ఫోటోసాయి, అగ్రి బోర్డు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు తిరుపాల్ నాయక్, నాయకులు గంగాద్రి, హనుమంతరెడ్డి, గంగిరెడ్డి, రామకృష్ణ, శంకరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చెన్నారెడ్డి, హరి, ఉత్తమరెడ్డి, రాజశేఖరరెడ్డి, నరసింహుడు, రవీంద్రరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, రాఘవయ్య, మురళీధర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, సుబ్బిరెడ్డి, తదితరులు ఉన్నారు.

135 గ్రామాలకు అప్రోచ్ రోడ్లు



దిన్నెమీదపల్లి సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: తమ ప్రభుత్వంలో నియోజకవర్గంలోని 135 గ్రామాలకు అప్రోచ్ రోడ్లు వేశామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని దిన్నెమీదపల్లి నుంచి కుమ్మరోళ్లపల్లి వరకూ రూ. 91.5 లక్షలతో నూతనంగా వేసిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యానికి నోచుకోని గ్రామాలకు సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వందేళ్ల మన్నికతో నాణ్యమైన రోడ్లు వేశామన్నారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో దాదాపు రూ. కోటి వరకు అభివృద్ధి పనులు చేశామన్నారు. గత 30 ఏళ్లలో లేని అభివృద్ధి ఈ నాలుగేళ్లలో జరిగిందన్నారు. రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే చంద్రబాబునాయుడు ఎల్లో మీడియాతో కలిసి దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, నాయకులు మధుకర్‌రెడ్డి, మండలకన్వీనర్ ప్రకాష్, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు ప్రసాద్, ఇర్షాద్, పవన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

జోరుగా 'వై ఏపీ నీడ్స్ జగన్'



రేగాటిపల్లిలో కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



మంగళమడకలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్మవరం, కదిరి, ముదిగుబ్బ, కనగానపల్లి, ఓడీ చెరువు, చెన్నేకొత్తపల్లి మండలాల్లో సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జోరుగా సాగింది. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. – సాక్షి బృందం



కనగానపల్లి మండలం ముత్తువకుంట్లో..



సీకేపల్లి మండలం ప్యాదింటిలో..

క్రీడా పరికరాల పంపిణీ

నల్లమాడ: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పరికరాలను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఎంపీపీతో పాటు మండల పరిషత్ కార్యాలయ ఏఓ రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ, మాజీ మండల కన్వీనర్ పొరకల రామాంజనేయులు చేతుల మీదుగా క్రీడా పరికరాలు అందజేశారు.

'ఆడుదాం ఆంధ్ర'లో పాల్గొనండి

పుట్టపర్తి: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసుకొచ్చే ఉద్దేశంతో చేపట్టనున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఉదయ్ భాస్కర్ తదితరులతో కలిసి క్రీడా సామాగ్రి ప్రదర్శించారు.

క్రీడాభివృద్ధికి ప్రాధాన్యం

పుట్టపర్తి టౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నట్లు జెడ్పీటీసీ గంగాదేవి పేర్కొన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరాల్లో భాగంగా ప్రభుత్వం గ్రామ సచివాలయాలకు సరఫరా చేసే క్రీడా పరికరాలను సోమవారం కొత్తచెరువు ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సిద్దారెడ్డి, ఎంపీపీ భర్త రెడ్డెప్పరెడ్డి, మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే భూ పంపిణీ

ధర్మవరం రూరల్: నిబంధనల ప్రకారమే 8వ విడత భూ పంపిణీ చేశామని తహసీల్దార్ యోగీశ్వరీదేవి తెలిపారు. 'ధర్మవరంలో భారీ భూ పందేరం' అంటూ సోమవారం 'ఈనాడు' పత్రికలో ప్రచురించిన కథనం కల్పితమేనని స్పష్టం చేశారు. ఆమె మాట్లాడుతూ 2022 సెప్టెంబర్‌లో అర్హులైన శివాయి జమేదారులకు 8వ విడత భూ పంపిణీ కింద సాగు భూమి పంపిణీ చేయమని జిల్లా యంత్రాంగం సూచించిందన్నారు. గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వ భూమిలో సాగులో ఉన్న శివాయిజమేదారులను గుర్తించామన్నారు. గ్రామ సభల్లో కొందరు రైతులు తాము ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్నామని, కానీ సదరు భూమిని ఇంతకు మునుపు వేరే వారికి డీ పట్టాలు ఇచ్చారని చెప్పారన్నారు. పట్టా షరతుల ఉల్లంఘన కింద తమకు హక్కు కల్పించాలని కోరినట్లు వెల్లడించారు. విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లగా అసైన్‌మెంట్ బదిలీ నిషేధ చట్టం మేరకు సదరు భూములు స్వాధీనం చేసుకుని, సాగులో ఉన్న రైతులకు పట్టా ఇవ్వాలని ఆదేశాలిచ్చారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కేవలం కొత్త శివాయిజమేదారులకు మాత్రమే డీ పట్టాలను అసైన్‌లో పొందుపరిచామన్నారు. జరిగింది ఇది అయితే, ఈనాడు పత్రికలో అవాస్తవ కథనం ప్రచురించారన్నారు. వివరణ కూడా తీసుకోకుండా కక్ష సాధింపు ధోరణితో ఒక దళిత మహిళా అధికారిణిని వేధించడం సరికాదన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ



పేరూరులోని బోగేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం



తలుపుల: దీపారాధన చేస్తున్న భక్తులు



కదిరిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాలతో పాటు రామగిరి, కనగానపల్లి మండలాల్లో సోమవారం కార్తీక శోభ నెలకొంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. – సాక్షి బృందం



ధర్మవరంలోని శివాలయంలో హోమాలు



పుట్టపర్తి మండలం ఎనుములపల్లి శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



బత్తలపల్లిలో ఉత్సవమూర్తుల ఊరేగింపు

వైభవం.. జ్యోతుల ఉత్సవం

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో సోమవారం చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటల దాటగానే ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి, బంగారు ఆభరణాలు తొడిగి, వివిధ రకాల పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం గ్రామస్తులు పొట్టేళ్లు, కోళ్లను బలిచ్చారు. ఆలయ గుడి కట్టు దారులు జ్యోతులను ఎత్తుకుని ఉదయం 6 నుంచి 8 గంటల వరకు జ్యోతులు ఆడారు. అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పెద్దమ్మ ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గాజులు, బొమ్మల దుకాణాలు భారీగా ఏర్పాటయ్యాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాటిల్ ప్రకాష్‌రెడ్డి, పాటిల్ కపిల్‌నాథ్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు అందుకున్న చౌడేశ్వరిదేవి

సంక్షిప్త సమాచారం

పని దినాలు పెంచాలి

కదిరి అర్బన్: గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాలు 200 రోజులకు పెంచాలని సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఉపాధి కూలీ రేట్లు కూడా పెంచాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షానవాజ్, ఖుదాబక్ష్ తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ల పరిశీలన

ఎన్పీకుంట: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు లేఅవుట్లను పంచాయతీ కార్యదర్శులు రమేష్‌నాయుడు, ముబారక్ సోమవారం పరిశీలించారు. పంచాయతీ ఆమోదం లేకుండా లేఅవుట్లను ఏర్పాటు చేయకూడదన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

కదిరి టౌన్: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అంజి డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ఓడీచెరువు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మిట్టపల్లి, మల్లాపల్లి, గాజుకుంటపల్లి, ఇనగలూరు, రామిరెడ్డిపల్లెలో సోమవారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కొత్తకోట చక్రధర్ రెడ్డి, రాజరెడ్డి, తదితరులున్నారు.

పరామర్శ

పుట్టపర్తి అర్బన్: మండలంలోని చెర్లోపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ లీలావతి మామ లక్ష్మన్న (70) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చెర్లోపల్లికి వెళ్లి లక్ష్మన్న మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ హనుమంతరెడ్డి, తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో సత్తా

కదిరి అర్బన్: కర్ణాటకలో ఈ నెల 10న జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి రూరల్ మండలంలోని హరీష్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బాలుర వైట్ బెల్ట్ కటాస్ విభాగంలో 6 మంది గోల్డ్‌మెడల్ సాధించారు. బాలికల కటాస్ విభాగంలో ఇద్దరు గోల్డ్ మెడల్ సాధించారు. మరికొంతమంది సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ గెలిచారు. విద్యార్థులను కరస్పాండెంట్ కిరణ్, కరాటే మాస్టర్ అక్బర్ అలీ అభినందించారు.

బుచ్చయ్యగారిపల్లిలో 'వికసిత్ భారత్'

పుట్టపర్తి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు మరింతగా చేరువ చేయాలని బుక్కపట్నం సచివాలయాల మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'లో భాగంగా బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి తక్షణ సాయం

బత్తలపల్లి: ఘంటాపురం గ్రామంలో దాసరి శ్రీరాములు (45) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ నాయకులు గునుగు సాంబ, పామాల నాగభూషణ, పోట్ల మర్రి సర్పంచ్ దామోధర తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా మృతుని భార్య లక్ష్మీదేవికి రూ.10 వేలు అందజేశారు.

పైపుల షాపులో చోరీ

కదిరి టౌన్: రాయచోటి రోడ్డు పక్కన ఉన్న పైపుల షాపులో చోరీ జరిగింది. షాపు రేకులు పగలకొట్టి కౌంటర్ టేబుల్ డ్రాలో ఉన్న రూ.1,60,000 ఎత్తుకెళ్లారు. పక్కన ఉన్న మరో షాపులో రూ 11,000 చోరీ అయినట్లు షాపుల యజమాని సుఫియాన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యం

నాగిరెడ్డిపల్లిలో నివాసముండే మతి స్థిమితం లేని మహిళ చింతా శ్రీదేవి అదృశ్యంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

ధర్మవరం రూరల్: పురపాలక సంఘానికి ఆస్తి, నీటి కొళాయి, ఖాళీ జాగా పన్నులు సకాలంలో చెల్లించాలని కమిషనర్ బండి శేషన్న కోరారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన

కదిరి అర్బన్: కుటాగుళ్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అరుణోదయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీఓ అంజనప్ప, మండల విద్యాధికారి చెన్నక్రిష్ణ, సంస్థ అధ్యక్షులు నాగమల్లు తదితరులున్నారు.

మోడల్ స్కూల్ తనిఖీ

నల్లచెరువు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌ను సోమవారం తహసీల్దార్ రవి కుమార్, ఎంఈఓ తిరుపాల్ నాయక్ తనిఖీ చేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు.

రెండు ట్రాక్టర్ల సీజ్

తనకల్లు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ పోలీసులు సోమవారం సీజ్ చేశారు. పాపాఘ్ని నది నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమచారం అందుకుని ట్రాక్టర్లను పట్టుకున్నారు. కేసు నమోదు చేశారు.

వినూత్నంగా నిరసన

కదిరి టౌన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు గంగన్న అనే వ్యక్తి సోమవారం పాదరక్షలు చుట్టూ వేసుకొని వినూత్నంగా నిరసన చేపట్టారు. కదిరి గ్రామ పొలం సర్వే నంబర్ 362లో 2.80, 351–ఏ సర్వే నంబర్‌లో తనకు భూమి ఉందన్నారు. కొంతమంది అక్రమంగా రిజిస్టర్ చేయించుకున్నారన్నారు. అధికారులకు చెప్పినా సమస్య పరిష్కరం కాకపోవడంతో నిరసన చేపట్టానని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం రూరల్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న చౌడేశ్వరి దేవాలయానికి సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆయన తన స్వగృహంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు..

ధర్మవరం రూరల్: పట్టణంలోని 27వ వార్డు ఇందిరమ్మ కాలనీలోని చౌడేశ్వరి దేవాలయానికి సోమవారం వార్డు కౌన్సిలర్ డోలా రాజారెడ్డి రూ. 10 వేలు అందించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాముల వారి అక్షింతల పంపిణీ

నల్లమాడ: అయోధ్య రామ జన్మ క్షేత్రం నుంచి రాముల వారి అక్షింతలు, ఆహ్వాన పత్రికలు నల్లమాడకు చేరాయి. సోమవారం స్థానిక రామాలయంలో హిందూ ధార్మిక సంఘం ఆధ్వర్యంలో వీటిని మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు పంపిణీ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, సమర సత సేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాలపై ప్రత్యేక నిఘా

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని కదిరి డీఎస్పీ శ్రీలత ఆదేశించారు. గాండ్లపెంట పోలీసుస్టేషన్‌ను ఆమె సోమవారం తనిఖీ చేశారు. కేసుల వివరాలు ఎస్‌ఐ వెంకటనారాయణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలన్నారు. నాటుసారా, పేకాట, మద్యం నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించబోమన్నారు. అనంతరం మండల పరిధిలోని సోమయాజులపల్లిలో బాల్యవివాహాలు, దిశ చట్టాలపై గ్రామస్తులకు డీఎస్పీ అవగాహన కల్పించారు. కదిరి రూరల్ పీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ఉన్నారు.

నేటి నుంచి సమ్మె

పుట్టపర్తి టౌన్: పట్టణంలో నేటి నుంచి పోస్టల్ ఉద్యోగుల నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు జీడీఎస్ హిందూపురం డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్ మునాఫ్ తెలిపారు. తమ 8 డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నట్లు తెలిపారు.

జయప్రదం చేయాలి

తాడిమర్రి: పోస్టల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని జీడీఎస్ జీజేసీపీ డివిజన్ నాయకులు రామ్మోహన్‌రెడ్డి పోస్టల్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నతాధికారులు చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నీళ్ల బిల్లులు మంజూరు చేయించండి

కనగానపల్లి: జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల మొక్కలు సాగుచేసుకున్న రైతులకు నీటి బిల్లులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి అధికారులను కోరారు. సోమవారం మండల కేంద్రంలో పర్యటించిన ఆయన.. రైతుల వినతి మేరకు స్థానిక ఎంపీడీఓ అలివేలమ్మతో కలసి పెండింగ్‌లో ఉన్న పండ్ల తోటల బిల్లులపై చర్చించారు. మండలంలోని వేలాది మంది మామిడి, చీనీ తోటలు సాగు చేసుకున్నారని, రెండేళ్లుగా నీళ్ల బిల్లు మంజూరు చేయలేదని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరితగతిన బిల్లులు మంజూరయ్యేలా చూడాలని ఎంపీడీఓకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యమ్మ భర్త నాగముని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే భవితకు పునాది వేసుకోవాలి

బత్తలపల్లి: యువత విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. సోమవారం బత్తలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని సెల్‌ఫోన్‌లో దిశయాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.